క్లుప్తంగా

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రత్నకుమార్

మెరకముడిదాం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులతో పాటు రాజకీయ పార్టీలు, ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాల్సిందేనని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి.రత్నకుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్‌లను గురువారం ఆయన సందర్శించారు. విద్యుత్ , తాగునీరు, ఫర్నీచర్ తదితర వసతులను పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీపురుపల్లిరూరల్: చీపురుపల్లి మండలంలోని గత్సలవలస సబ్‌స్టేషన్ పరిధి కర్లాం,మోదుగులపేట గ్రామాలకు, గరివిడి సబ్‌స్టేషన్ పరిధిలో రేగటి, విజయరాంపురం, సీలాద్రిపురం, వెదుల్లవలస, ఆవగూడెం గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆర్ఈసీఎస్ ఏడీ బి.జగన్నాథం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ లైన్లకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

జమ్ములో పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ నరసింహమూర్తి

గుర్ల: మండలంలోని జమ్ము గ్రామంలో సర్పంచ్ గొర్లె నరసింహమూర్తి గురువారం పారిశుద్ధ్య పనులు చేయించారు. గ్రామంలోని కాలువల్లో పూడిక, చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. దోమల నివారణకు బ్లీచింగ్ చల్లారు. గ్రామంలో తరచూ పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నామని సర్పంచ్ తెలిపారు.

మధ్యాహ్న భోజనాల పరిశీలన




వంటకాలను రుచి చూస్తున్న సర్పంచ్ కుమార్

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని అర్తమూరు ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను సర్పంచ్ పొన్నాడ కుమార్ గురువారం పరిశీలించారు. వంటకాలను రుచి చూశారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం రోజూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పథకం నిర్వాహకులకు సూచించారు.

'స్పందన'ను సద్వినియోగించుకోండి

గజపతినగరం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతీ సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించనున్నామని ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.సుదర్శనం తెలిపారు. గురువారం ఆయన తనకార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రతీ సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 'స్పందన' నిర్వహిస్తామని చెప్పారు. మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు అందించవచ్చని అన్నారు. స్పందనలో అందించే అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపిస్తామని, ఈఅవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేసవి నేపథ్యంలో ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

చురుగ్గా రోడ్డు విస్తరణ పనులు



గడసాం వద్ద చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులు

దత్తిరాజేరు: గజపతినగరం నుంచి మండలంలోని పోరలి కూడలి వరకు రోడ్డు విస్తరణ పనులు కొద్ది రోజులుగా చురుగ్గా సాగుతున్నాయి. రూ.9 కోట్ల ఏడీబీ నిధులతో ఈ పనులు చేపడుతున్నట్లు జేఈ నరసింహమూర్తి గురువారం తెలిపారు. ముందుగా కల్వర్టులు నిర్మిస్తున్నామని, ఈ పనులు పూర్తయిన తర్వాత ప్రస్తుతం 12 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డును 24 అడుగుల రోడ్డుగా విస్తరిస్తామని చెప్పారు. ఇప్పటికే కొంత భాగం గ్రావెల్‌తో లెవెలింగ్ పనులు పూర్తయ్యాయని చెప్పారు.

అభివృద్ధికి ఓటుతో మద్దతు పలకండి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎంపీ బెల్లాన



ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు ద్వారా మద్దతు తెలిపాలని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పట్టభద్రులను కోరారు. పట్టణంలోని పిల్లపేట, చిలుకూరివీధి, రామాంజనేయకాలనీ తదితర ప్రాంతాల్లో ఎంపీ బెల్లాన గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించా రు. యువత, నిరుద్యోగులకు వైఎస్సార్ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. దివంగత మహానేత వైఎస్. రాజశేఖర్ రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు అవకాశం కల్పించారని గుర్తు చేశారు. అదే బాటలో ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ, వైద్యఆరోగ్యశాఖ, పోలీస్‌శాఖలో లక్షలాది ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. చంద్రబాబునాయుడు యువతను మోసం చేశారే తప్ప ఎలాంటి మేలు చేయలేదన్నారు. బాబు వస్తే ఇంటికో జాబు అన్నారని, ఎంత మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారో చెప్పాలని కోరారు. చంద్రబాబు మోసపూరిత హామీలు నమ్మవద్దని, చెప్పింది చేసి చూపించే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు. నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, ఇప్పిలి గోవింద, గిరడ రాందాసు, ఇప్పిలి తిరు మల, ముల్లు పైడిరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి

బొండపల్లి: ఉత్తరాంధ్ర అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని బిల్లలవలస, నెలివాడ, కెరటాం, అంబటివలస, గొట్లాం, వేండ్రాం, ఒంపల్లి, కొండకిండాం , కిండాం అగ్రహారం గ్రామాల్లో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం గురువారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు పట్టభద్రులు తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించి, అభివృద్ధి, సంక్షేమ పాలనకు మద్దతు తెలపాలని కోరారు.. పార్టీ నాయకులు,కార్యకర్తలు సుధాకర్ విజయానికి కృషి చేయాలని సూచించారు.

గృహసారథులే విజయ సారథులు

అంతకుముందు ఆయా గ్రామాల్లో గృహసారథులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసి పార్టీకి విజయసారథులుగా నిలవాలని గృహసారథులను ఎమ్మెల్యే కోరారు.ఈ నెల18 నుంచి నిర్వహించనున్న 'మానమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో విజయవంతం చేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని, వారి సమస్యలు తెలుసుకోవాలని చెప్పారు. వారం రోజుల పాటు అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, ఎంపీపీ చల్ల చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, మాజీ ఎంపీపీ బండారు బంగారం, వైస్ ఎంపీపీలు మీసాల సరోజిని, జి.ఈశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ, సచివాలయ మండల కన్వీనర్ పల్లి రఘు, గొట్లాం, రాచకిండాం పీఏసీఎస్ చైర్మన్‌లు గొల్లు సతీష్, మహంతి రమణ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తాళ్లపూడి కృష్ణ, సర్పంచ్‌లు నెట్టి ఏసురత్నం, నంబూరి రాజేష్, తాళ్లపూడి కీర్తి, కర్రోతు శ్రీనివాసరావు,లండా నారాయణమ్మ పాల్గొన్నారు.



బొండపల్లి: బిల్లలవలసలో పట్టభద్రుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

సీతంరాజు సుధాకర్‌ను గెలిపిద్దాం

కొత్తవలస/శృంగవరపుకోట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయానికి సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కొత్తవలసలోని తన క్యాంపు ఆఫీస్‌లో గురువారం ఉదయం ఎల్. కోట, కొత్తవలస మండలాల సచివాలయాల కన్వీనర్లు,కో-కన్వీనర్లు, క్రియాశీలక నాయకులతో, సాయంత్రం ఎస్. కోటలోని సుబ్బిరామిరెడ్డి కల్యాణ మండపంలో ఎస్.కోట, వేపాడ మండలాల సచివాలయాల కన్వీనర్లు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఓటు హక్కు ఉన్న పట్టభద్రుల ను కలిసి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధిని వివరించి వారి మద్దతు కోరాలని సూచించారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకూ చేకూర్చిన లబ్ధిని, విద్య,వైద్యరంగాల్లో, పరిపాలనలో చేపడుతున్న సంస్కరణలను పట్టభద్రులకు వివరించి, వారు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సుధాకర్‌కు ఓటు వేసేలా చూడాల్సిన బాధ్యత మ నపై ఉందన్నారు. ఎల్.కోట ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, కొత్తవలస జెడ్పీటీసీ నెక్కలి శ్రీదేవి, కొత్తవలస, ఎల్.కోట మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, గుమ్మడి సత్యనారాయణ, మండల గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లుయడ్ల కిశోర్, బొంతల వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ రామస్వామి పాల్గొన్నారు.



కొత్తవలస: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడిబండి శ్రీనివాసరావు

నేటి నుంచి పశువులకు టీకాలు



బల్లంకిలో పశువులకు గర్భకోశ చికిత్స చేస్తున్న పశుసంవర్థక శాఖ ఏడీఏ చలపతిరావు

వేపాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు శుక్రవారం నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నామని పశుసంవర్థక శాఖ ఎస్.కోట సహాయ సంచాలకులు డాక్టర్ బి.చలపతిరావు తెలిపారు. బల్లంకిలో గురువారం నిర్వహించిన పశువైద్యశిబిరంలో 68 పశువులకు గర్భకోశ చికిత్స చేసి, ఉచితంగా మందులు సరఫరా చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంటు వ్యాధి నివారణ మాసోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నెలరోజుల పాటు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ఉంటుందని, నాలుగు నెలలు దాటిన దూడ నుంచి ప్రతీ పశువుకు టీకా వేస్తామన్నారు. ఎస్.కోట మండలంలో 15,300 పశువులు, వేపాడ మండలంలో 17,450 పశువులకు టీకాలు వేసేందుకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఇప్పటికే టీకాలను పశువైద్యకేంద్రాలకు సరఫరా చేశామని వివరించారు. అలాగే పశువుల దాణాకు టి.ఎం.ఆర్(టోటల్ మిక్సర్ రేషన్)రాయితీపై ఇస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఈ దాణాను ఎస్.కోట మండలంలో 79.2 టన్నులు, వేపాడ మండలంలో 46.8 టన్నులను పాడిరైతులకు విక్రయించామని తెలిపారు. దాణా కావాల్సిన రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాలకు ఆధార్ కార్డు తీసుకుని వెళ్లి వెటర్నరీ అసిస్టెంట్‌ను సంప్రదించాలని సూచించారు. వేపాడ పశువైద్యాధికారి సింహాచలంనాయుడు, గోపాలమిత్రలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

● సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం



మెరకముడిదాం: ఉత్తరావల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తు న్న సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ఆపార్టీ నాయకులు గుర్ల, గరివిడి, మెరకముడిదాం మండలాల్లోని పలు గ్రామాల్లో గురువారం ప్రచారం చేశా రు. పట్టభద్రులను కలిసి తమ మొదటి ప్రాధాన్యతా ఓటును సుధాకర్‌కు వేసి గెలిపించాలని కోరారు.

– గుర్ల, చీపురుపల్లిరూరల్, మెరకముడిదాం



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలం కోనూరులో ప్రచారం చేస్తున్న వైస్ ఎంపీపీ వెంకటఅప్పలరాజు తదితరులు



గుర్ల: కెల్ల గ్రామంలో ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, స్థానిక నాయకులు

నేడు పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

గజపతినగరం రూరల్: గంగచోళ్లపెంట గ్రామంలోని జ్ఞానానంద ఆశ్రమంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు గురువారం తెలిపారు. ఆశ్రమ 93వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నామని,తొలిరోజు పార్వతీపరమేశ్వరుల కల్యాణం జరిపిస్తామని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ హాజరుకానున్నారని చెప్పారు. అలాగే ఉప్పలపాటి రవిస్వామి ఆధ్వర్యంలో క్రియాకుండలి దీక్షా తరగతులను 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు రోజూ రెండు పూటలా నిర్వహించనున్నామని, ఆసక్తి ఉన్నవా రు ఆశ్రమంలో నిర్వాహక కమిటీని సంప్రదించాలని సూచించారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



రాజకీయపార్టీల నేతలతో సమావేశమైన తహసీల్దార్ హేమంత్‌కుమార్

జామి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్నిరాజకీయ పార్టీలు సహకరించాలని తహసీల్దార్ జి.హేమంత్ కుమార్ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయపార్టీల నేతలతో గురువారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 1,863 మంది పట్టభద్రులు ఓటు న మోదు చేసుకున్నారని, వీరి కోసం మూడు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల నియమావళిని అన్ని పార్టీలు పాటించాలన్నారు. వీఆర్‌ఓలు పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఓటరు స్లిప్పులు పంపిణీ చేయనున్నారని చె ప్పారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.రవికుమార్, టీడీపీ, సీపీఐ నేతలు ఎల్.రవికుమార్, డి.అప్పలరాజు, బీఎస్పీ తదితర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి



కొత్తవలస: అరకు-విశాఖ రోడ్డులో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు



వేపాడ: బొద్దాం జంక్షన్‌లో రాస్తారోకో చేస్తున్న సీపీఎం శ్రేణులు



గజపతినగరం: గ్యాస్ బండకు కొబ్బరి కాయకొట్టి పూజలు చేస్తూ నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కొత్తవలస: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డగోలుగా, ఎప్పటికప్పుడు గ్యాస్ ధరలు పెంచి సామాన్యుల నడ్డివిరిస్తోందని, పెంచిన ధరలను తగ్గించాలని సీపీఎం నాయకుడు గాడి అప్పారావు ఆధ్వర్యంలో కొత్తవలస జంక్షన్‌లో అరకు-విశాఖ రోడ్డుపై గురువారం రాస్తారోకో నిర్వహించారు. రోడ్డు మధ్యలో గ్యాస్ సిలిండర్లతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

పేద, మధ్యతరగతి ప్రజలపై భారం

గజపతినగరం: కేంద్రంలోని బీజేపీ సర్కారు తరచూ గ్యాస్ ధరలు పెంచుతూ పేదలు, మధ్యతరగతి ప్రజలపై పెనుభారం మోపుతోందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వి.లక్ష్మి, జి.శ్రీనివాస్ మండిపడ్డారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని మెంటాడ జంక్షన్ వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్ల క్రితం రూ.400 ఉన్న గ్యాస్‌బండ ధర బీజేపీ ప్రభుత్వం రూ.1,150కు చేరిందని అన్నారు. పెట్రోలు,డీజిల్, ఎరువులు,పురుగు మందులు, రైల్వే రవాణ చార్జీలను పెంచి ప్రజలపై భారం మోపుతున్న మోదీ పాలనను ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపు నిచ్చారు. సీపీఎం నాయకలు టి.పైడిపు నాయుడు, సూర్యనారాయణ, కృష్ణ, డి.రాము, బి.రాము,గణేష్, లక్ష్మణ పాల్గొన్నారు.

సామాన్యుడి నడ్డి విరుస్తోంది..

వేపాడ: గ్యాస్, చమురు ధరలను కేంద్ర ప్రభుత్వం తరచూ పెంచుతూ సామాన్య ప్రజల నడ్డివిరిస్తోందని సీపీఎం జిల్లా నాయకుడు చల్లా జగన్ ఆరోపించారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతూ మండలంలోని బొద్దాం జంక్షన్‌లో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఆటో యూనియన్, క్వారీ కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయాల వార్షికోత్సవం



కొత్తవలస: తుమ్మికాపల్లిలో సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు



లక్కవరపుకోట: గొల్జాంలో షిర్డీ సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

లక్కవరపుకోట: మండలంలోని గొల్జాం గ్రామంలో షిర్డీసాయిబాబా ఆలయం వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తూర్పాటి మహేశ్వరరావు,కమల దంపతులతో అర్చకులు కె.శ్రీనివాసరావు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు. గ్రామంతో పాటు చుట్టు పక్క గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి సాయినాథున్ని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

తుమ్మికాపల్లిలో..

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గేటు వద్ద షిర్డీ సాయినాథుని ఆధ్యాత్మిక జ్ఞానపీఠం వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు అంపోలు ఉమామహేశ్వరశర్మ, అర్చకులు కిరణ్‌కుమార్‌శర్మ సాయిబాబాకు విశేష అర్చనలు, క్షీరాభిషేకం చేశారు.

పట్టభద్రులకు ఓటరు స్లిప్పులు అందజేయండి



కొత్తవలస: ఓటరు స్లిప్పులను గ్రామాల వారీగా వర్గీకరిస్తున్న బీఎల్‌ఓలు



దత్తిరాజేరు: బీఎల్‌ఓలతో సమావేశమైన తహసీల్దార్, ఎంపీడీఓ

కొత్తవలస: ఈనెల 13వ తేదీన నిర్వహించనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు హక్కు ఉన్న పట్టభద్రులకు ఓటరు స్లిప్పులు అందించే బాధ్యత బీఎల్‌ఓలదేనని తహసీల్దార్ డి. ప్రసాదరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి గురువారం చేరిన ఓటరు స్లిప్పులను బీఎల్‌ఓలు గ్రామాల వారీగా వర్గీకరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 2,337మంది పట్టభద్రులకు ఓటు హక్కు ఉందని, వీరందరికీ మూడు రోజుల్లో స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలని, ఓటరు స్లిప్పులు అందజేసిన తర్వాత వారి సంతకం తీసుకోవాలని సూచించారు. స్లిప్పుల పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఎస్‌డీటీ రమేష్, రీసర్వే డీటీ అప్పారావు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయాలి

దత్తిరాజేరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన విధులను బీఎల్‌ఓలు బాధ్యతగా నిర్వర్తించాలని తహసీల్దార్ రమేష్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని బీఎల్‌ఓలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఎవరైనా ఎన్నికల ప్రచారం చేస్తే వారి సమాచారం తెలియజేయాలని కోరారు. ఎన్నికలు నియమావళి ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని, ఈ విషయంపై ఎప్పటికప్పుడు గ్రామాల్లో దండోరా వేయించాలని సూచించారు. అనంతరం పట్టభద్రులకు సంబంధించిన ఓటరు స్లిప్పులను బీఎల్‌ఓలకు అందజేశారు.

ఆడపిల్లను బతకనిద్దాం.. చదవనిద్దాం

ఆడపిల్లలకు స్వేచ్ఛా జీవితాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని పలువురు వక్తలు అన్నారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బేటీ బచావో బేటీ పడావో పేరిట నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గ్రామాల్లో గురువారం ర్యాలీలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా పోలీసులు, వైద్యాధికారులు, ఐసీడీఎస్ అధికారులు మాట్లాడు తూ ఆడపిల్లలను తల్లిదండ్రులు తప్పనిసరిగా చదివించాలని, వివక్ష తగదని, బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఆడపిల్లలకు ఆరోగ్య జాగ్రత్తలతో పాటు, పలుచట్టాల గురించి వివరించారు.

– చీపురుపల్లి, వేపాడ, గంట్యాడ, జామి



జామి: విజినిగిరి రామా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్‌ప్రేమ్‌కుమార్



వేపాడ: బక్కునాయుడుపేట కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వేపాడ వైద్యాధికారి ధరణి



చీపురుపల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న పట్టణంలోని బస్టాండ్ ఏరియా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీలు, సచివాలయ పోలీసులు, ఉపాధ్యాయులు



గంట్యాడ: కొరాపుబిల్లి కేజీబీవీలో మాట్లాడుతున్న సీడీపీఓ ఉమాభారతి